

మళ్లీ డ్రోన్ల కలకలం

యాచారం, సెప్టెంబరు 13 : మండలంలోని నందివనపర్తి, పిల్లిపల్లిలో గురువారం రాత్రి 9.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు డ్రోన్లు తిరిగాయి. ఆకాశంలో చాలా ఎత్తులో కొద్దిసేపు.. ఆతర్వాత నేలకు దగ్గరగా వచ్చాయని గ్రామస్తులు తెలిపారు. అయితే, రాత్రివేళ వాటిని ఎవరు ఎగరేస్తున్నారో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల చిఇఇంతపట్ల, మొండిగౌరెల్లి, మేడిపల్లి, నానక్‌నగర్‌లో రెండు డ్రోన్లు ఎగిరాయి. వాటిని చూసిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సీఐలు నర్సింహరావు, శంకర్‌కుమార్‌తో ప్రస్తావించగా విచారణ చేస్తున్నామని తెలిపారు.



ప్రచురితమైన కథనం

ఆక్రమణదారులపై త్వరలో చర్యలు

» ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి

ఆదిభట్ల, సెప్టెంబరు 13: కొంగరకలాన్ గ్రామంలోని కొత్త చెరువు బఫర్‌జోన్‌లో ఆక్రమణకు పాల్పడ్డవారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఏఈ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో ఆక్రమణల పర్వంలో భాగంగా శుక్రవారం 'ఆక్రమణలో కొత్తచెరువు' పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏఈ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆక్రమణల విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. నీటి పారుదలశాఖ అధికారులు రెవెన్యూ శాఖతో కలిసి పనిచేస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దు రాళ్లను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ విభాగానికి లేఖ రాశామన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధి ఎంత అనేది కచ్చితంగా తేల్చేందుకు వారం రోజుల సమయం పడుతుందన్నారు. ఆక్రమణకు గురైనట్లు తేలితే వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రెండు రోజులలో ఆమె ఫీల్డ్ విజిట్ చేస్తామని తెలిపారు.



ప్రభుత్వం ఇచ్చే పింఛను ఎందరో అభాగ్యులకు ఆసరాగా నిలుస్తోంది. అర్హత ఉండి కూడా అందకపోవడంతో కొందరు అవస్థలు పడుతున్నారు. నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్నా చాలా మంది పింఛను వస్తుందేమోనని నెలలు, ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ రాలేదని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

» అర్హులైనా అందని ఆసరా పింఛన్లు
» నాలుగేళ్లుగా తప్పని ఎదురుచూపులు
» చెప్పులరిగేలా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
» అవస్థలు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు
» ఆశగా ఎదురుచూస్తున్న అభాగ్యులు
» హామీ మేరకు పెన్షన్ సొమ్మును పెంచని ప్రభుత్వం
» జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 1,99,064 మంది

నిరీక్షణ.. ప్రదక్షిణ!



పింఛను రకం	సంఖ్య
వృద్ధాప్య	78,543
వితంతు	83,693
దివ్యాంగ	27,178
కల్లుగీత	2,367
చేనేత	821
బీడీ	14
ఒంటరి మహిళ	6,448
ఫైలేరియా	57
డయాలసిస్	342

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న..

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శనగళ్ల నర్సింహులు. చేవెళ్ల మండలం ఆలూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు. వయస్సు 42 సంవత్సరాలు. పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో క్యూలెక్స్ దోమ కుట్టడంతో బోదకాలు వ్యాధి ప్రబలింది. రోజురోజుకూ కాలు వాపు పెరిగిపోతోంది. ఎనిమిదేళ్లుగా నరకం అనుభవిస్తున్నాడు. భర్తకు బదులుగా భార్య లక్ష్మి పారిశుధ్య పనులు చేస్తుంది. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లాడు. ఆమెకు వచ్చే రూ.8,500 జీతంలో సగం డబ్బులు నర్సింహులు వైద్యానికే ఖర్చవుతోంది. వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక మందులు వేసుకోవడమే మానేశాడు. దీంతో బోదకాలు మరింతగా పెరిగింది. పింఛను కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకున్నా.. ఫలితం లేకుండా పోయింది. నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాడు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రభుత్వంలోనైనా తనకు పింఛన్ ఇప్పించాలని అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాడు.





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13): అర్హులైన వారు ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. అర్హులై ఉండి దరఖాస్తు చేసినా పింఛను మంజూరు రాక ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. భర్త చనిపోయిన మహిళలు, సొంత పనులు కూడా చేసుకోలేని దివ్యాంగులు, వయస్సు మీద పడిన వృద్ధులు.. ఇతర కేటగిరిలకు చెందిన చాలా మంది ఆసరా పింఛను కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. నాలుగేళ్లుగా ఈ నిరీక్షణ తప్పడం లేదు. మండల అభివృద్ధి కార్యాలయాలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చుట్టూ ప్రదక్షిణలు చూస్తూ వారి గోడును వెల్లబోసుకుంటున్నారు. అయినా పింఛను రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి జీవనాధారం లేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా

మిగతా 8వ పేజీలో...

నా పెన్షన్ తొలగించారు



గతంలో నాకు పింఛను వచ్చేది. రెగ్యులర్‌గా తీసుకునే వాడిని. నా కుమారుడు చనిపోయాడు. గ్రామం వదిలి వెళ్లాను. దాంతో మూడు నెలలు పింఛను తీసుకోలేదని నా పేరును తొలగించారు. తిరిగి దరఖాస్తు చేసుకున్నాను. రెండు సంవత్సరాల నుంచి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అయినా ఎవరూ స్పందించడం లేదు.

-మోతే రత్నయ్య, దివ్యాంగుడు, ఆలూరు, చేవెళ్ల మండలం

సమాచారం ఇవ్వకపోవడంతో రద్దయింది



నా భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. పింఛను మంజూరైంది. ఈ విషయాన్ని అధికారులెవరూ చెప్పలేదు. మూడు నెలల పాటు తీసుకోక పోవడంతో వచ్చే పింఛను రద్దయింది. మళ్లీ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. రెండేళ్లుగా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాను. పింఛను ఇంకా రాలేదు.

-పెద్ద కటికె బీబీ బేగం, ఆలూరు, చేవెళ్ల మండలం



ఎక్కడికక్కడ కట్టడి!

హౌస్ అరెస్ట్ అయిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు

» అరెకపూడి, కౌశిక్‌రెడ్డి జగడంతో ముందస్తు చర్యలు
» జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల అరెస్టు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13): పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో శుక్రవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు లు చేశారు. గాంధీ ఇంటికి ర్యాలీగా వెళ్లి అక్కడ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్ని మండలాల పరిధిలో బీఆర్ఎస్ నాయకులను ఉదయమే అదుపులోకి తీసుకున్నారు. హౌస్ అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. కేశంపేట పోలీసులు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఎక్లాస్‌ఖాన్‌పేటలోని ఆయన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. కడ్తాల మండల కేంద్రంలో ముందస్తు అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఆ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు తదితరులున్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత ధోరణిని అవలంబిస్తుందని విమర్శించారు. దాడి చేసిన ఎమ్మెల్యే గాంధీని వదిలిపెట్టి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పై కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.



కడ్తాలలో నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13 : ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని శక్తివంతమైన సాధనమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, ఉడుగుల మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పోషణ మాసంపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పెరుగుదలకు, పోషణ లోపం తగ్గించుటలో, బరువు లోపం లేకుండా పోషక ఆహారాలను అందించాలని సూచించారు. జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 1,600 అంగన్‌వాడీ కేంద్రాలో 1.44 లక్షల పైచిలుకు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్నారని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు చురుకుగా పని చేయాలన్నారు. ఈ నెల 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసంలో రక్తహీనత, పౌష్టిక ఆహారం లోపం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లల్లో అనిమియా రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, వార్డు ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ కేసు

- 13 రోజులు గడుస్తున్నా కొలిక్కిరాని వైనం
- పెద్దమొత్తంలో చోరీకావడంతో సర్వత్రా ఉత్కంఠ


రుద్రారం గ్రామంలో చోరీ జరిగిన ఇల్లు

పెద్దేముల్, సెప్టెంబరు 13: మండలంలోని రుద్రారంలో జరిగిన దొంగతనం కేసు పోలీసులకు ఒక సవాల్‌గా మారింది. దొంగలను పట్టుకోవడానికి పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా కనిపిస్తోంది. పోలీసులు మాత్రం ఒక నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. దొంగలను పట్టుకుని తీరతామని చెబుతున్నారు. రుద్రారం గ్రామంలో ప్రముఖ సుద్దవ్యాపారి, మాజీ వైస్‌ఎంపీపీ గోపాల్‌రెడ్డి ఇంట్లో ఆగస్టు 30న చోరీ జరిగింది. గోపాల్‌రెడ్డి కుటుంబం ఇంట్లో లేని విషయాన్ని గుర్తించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు 20 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రూ.14లక్షల పైచిలుకు విలువ కలిగిన బంగారం చోరీకావడంతో దొంగలు ఎప్పుడు దొరుకుతారనే ఉత్కంఠ నెలకొంది. చోరీ జరిగిన తీరు చూస్తే కాస్త భిన్నంగానే కనిపిస్తోంది. సాధారణంగా ఇంట్లో ఎవరూ లేనపుడు చోరీజరిగితే తాళాలు విరగ్గొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడతారు. కానీ ఇక్కడ తాళం విరగ్గొట్టలేదు. తాళం చెవితో తాళం తీసి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, క్రైం పోలీసులు వచ్చి విచారణ జరిపినా నేరస్థులను కనిపెట్టలేకపోతున్నారు. చిన్న చిన్న దొంగతనాలు జరిగినపుడు ముద్దాయిలను ఇట్టే పట్టేసిన పోలీసులు ఇక్కడ మాత్రం ఎందుకు వెనుకబడిపోయారనే చర్చసాగుతోంది. చోరీ జరిగిన బీరువాపై గానీ, ఇంటి తలుపులపై గానీ లభించిన వేలిముద్రలు పోలీసుల రికార్డుల్లో ఉన్న నేరస్తుల వేలిముద్రలతో సరిపోవడం లేదనిపిస్తోంది. వేలిముద్రలు గుర్తిస్తే ఈపాటికి నిందితులను పట్టుకుని విచారణ జరిపేవారు. చోరీ జరిగి 13రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు నిందితులనే గుర్తించలేకపోయారు. చోరీకి సంబంధించి ఎంతమందిని విచారించినా నిందితులకు సంబంధించిన ఎలాంటి సమాచారం పోలీసులు రాబట్టలేకపోయినట్లు సమాచారం. ఏది ఏమైనా ఈ కేసు పోలీసులకు ఒక సవాల్‌గా మారిందనే చెప్పాలి. ఈ కేసును పోలీసులు చేధిస్తారా? లేక అలాగే వదిలేస్తారా? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ లీగల్‌సెల్ స్టేట్ జాయింట్ కన్వీనర్‌గా నసీర్ పాషా

మహేశ్వరం, సెప్టెంబరు 13 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెల్‌లీగల్ జాయింట్ కన్వీనర్‌గా మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన మహ్మద్ నసీర్ పాషాను నియమిస్తున్నట్లు లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో నసీర్‌పాషాకు నియామక పత్రం అందజేశారు. నసీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పజెప్పినందుకు నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా లీగల్‌సెల్ రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పజెప్పినందుకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక అభినందనలు చెప్పారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వికారాబాద్, సెప్టెంబరు 13: విద్యార్థులు తమలోని ఆత్మన్యూనతా భావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడు విజయం వరిస్తుందని వికారాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు, వికారాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. వికారాబాద్ క్లబ్‌లో శుక్రవారం వికాస్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. తల్లిదండ్రులు, గురువుల కలలను సాకారం చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే మామూలు చదువులు సరిపోవని, ప్రమాణాలతో కూడిన విద్య అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఉమారాణి, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, కృష్ణ, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు నైపుణ్య శిక్షణ కోర్సులు

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హన్మంతరావు

వికారాబాద్, సెప్టెంబరు 13: ప్రభుత్వ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చదువుకున్న నిరుద్యోగ మైనార్టీ యువత కోసం నైపుణ్య అభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హన్మంతురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, విద్య, ఆరోగ్యం, అకౌంటింగ్(సీఏ, ట్యాలీ, ఐటీ, జీఎస్టీ) హౌసింగ్, పశువుల పెంపకం, డెయిరీ, వెటర్నరీ మొదలైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫ్యాషన్ డిజైనింగ్(టైలరింగ్), అడ్వాన్స్ బ్యూటిఫికేషన్, హార్టికల్చర్, టూరిజం హాస్పిటాలిజీ, ఎయిర్‌హోస్టెస్ క్యాబిన్‌క్రూ, మొదలైన వాటిలో లైట్‌హెవీ మోటార్ డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్, ఫైర్ సేఫ్టీ స్వయం ఉపాధి స్మార్ట్‌ఫోన్ హ్యాండ్‌సెట్ రిపేరింగ్, (సాఫ్ట్‌వేర్ హార్డ్‌వేర్) అడ్వాన్స్‌డే మెకనైజ్డ్ ఫర్నీచర్ మ్యానుఫ్యాక్చరింగ్ (ప్యాకేజింగ్ ఇండస్ట్రీ తదితర వాటిలో శిక్షణ ఇచ్చేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టాస్క్, మెప్మా, జీవోఐ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థలు శిక్షణ ఇస్తాయన్నారు. శిక్షణ సంస్థలు సంబంధిత పత్రాలు, ప్రాజెక్టురిపోర్టుతోపాటు హార్డ్ కాపీలు వైస్‌ఛాన్స్‌లర్ మేనేజింగ్ డైరెక్టర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో అక్టోబర్ 4వ తేదీలోపు హైదరాబాద్ ఆఫీస్ 5వ అంతస్తులోని హజ్‌హౌస్ నాంపల్లిలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో కొడంగల్ గిరిజన గురుకుల విద్యార్థుల హవా

గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 13: ఈనెల 12వ తేదీన రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ మీట్-2024లో భాగంగా నిర్వహించిన పోటీల్లో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల హవా కొనసాగింది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి అంగోత్ ప్రవీణ్ షాట్‌పుట్‌ను 10.98 మీటర్ల దూరం విసిరి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. అదేవిధంగా డిస్కస్‌త్రో 16.60 మీటర్ల దూరం విసిరి జిల్లాస్థాయిలో రెండవ స్థానంలో నిలిచాడు. లాంగ్ జంప్‌లో 9వ తరగతి విద్యార్థి వికాస్ 4.4 మీటర్లు, బ్యాక్‌త్రోలో 13మీటర్లు, 60 మీటర్ల రన్నింగ్ 8.07సెకండ్లలో చేరుకుని జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ఖోఖో విభాగంలో 7వ తరగతి విద్యార్థి సేనావత్ రమేశ్ జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ముగ్గురు విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించడంతో శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వారిని ఎంతగానో ప్రోత్సహించిన పీడీ గోపాల్, పీఈటీ వెంకటేశ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అందుకుగానూ పాఠశాల, కళాశాలకు పీడీ, పీఈటీలను ప్రభుత్వం నియమించిందని చెప్పారు.

ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



వికారాబాద్, సెప్టెంబరు 13: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఆయన ఛాంబర్ నుంచి శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్నిశాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వేడుకల నిర్వహణకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలి వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయాశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అసభ్యంగా ప్రవర్తిస్తున్న వార్డెన్లను డిస్మిస్ చేయాలి



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

షాద్‌నగర్, సెప్టెంబరు 13: పాఠశాలలో అసభ్యకరంగా ప్రవరిస్తున్న వార్డెన్లను ఉద్యోగాల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మేధా ఇంటర్‌నేషనల్ పాఠశాల ఎదుట ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్ చౌహాన్ మాట్లాడుతూ పాఠశాలలో వార్డెన్లుగా ఉన్న రామకృష్ణ, నవ్య రాత్రివేళలో విద్యార్థుల హాస్టల్ గదులకు గొళ్లాలు పెట్టి అసభ్యకరంగా ప్రవహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పసిగట్టిన విద్యార్థులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆగ్రహించిన విద్యార్థులు పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారన్నారు. వారికి మద్దతుగా తాముకూడా విద్యార్థులకు అండగా నిలిచి ధర్నా నిర్వహించామని తెలిపారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి



మాట్లాడుతున్న సదానందం గౌడ్

ఆమనగల్లు, సెప్టెంబరు 12: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ కోరారు. మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, మాడ్గుల మండలం కొల్కులపల్లి, నాగిళ్ల, ఆవురుపల్లి, మాడ్గుల, ఇర్విన్ జడ్పీహెచ్ఎస్‌లను శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదానందం మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జూలై నెల వేతనాలు నేటికీ అందించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని, డీఎస్సీ నియమకాలు పూర్తి చేయాలని, అప్పటి వరకు బోధనకు ఆటంకం కలుగకుండా విద్యా వాలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదుకు రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సత్తు పాండు రంగారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కోశాధికారి బాల్‌నర్సింహ్మలు, ఎస్టీయూ అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణ, నవీన్ కుమార్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 317 ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలి

నవాబుపేట, సెప్టెంబరు 13: జీవో 317 ద్వారా వికారాబాద్ జిల్లాకు పంపిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించి నిరుద్యోగ యువతీ, యువకులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవో 317 ద్వారా వికారాబాద్‌కు కేటాయించిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలన్నారు. ఈ జీవోతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేజీబీవీల్లో రెండవ సీఆర్‌టీ పోస్టులను మంజూర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, మండల అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కోశాధికారి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు పరమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రండి.. సంఘంలో చేరండి

- పొదుపు సంఘంలో కొత్త సభ్యత్వాల నమోదు
- ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



కులకచర్ల సెర్ఫ్ కార్యాలయంలో మహిళా సభ్యుల సమావేశం

కులకచర్ల, సెప్టెంబరు 13: పొదుపు సంఘాల మహిళలను మరింత చైతన్యవంతులు చేసి సమాంతర వ్యవస్థను నిర్వహిస్తున్న క్రమంలో కొత్త సభ్యత్వాలపై గ్రామీణాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళకు సభ్యత్వం ఉండేలా మండల సమాఖ్య, ఐకేపీ అధికారులు చూసుకుంటున్నారు. మండలంలోని 32గ్రామ పంచాయతీల్లో వీవోలు 30మంది ఉండగా గ్రామసమాఖ్య సంఘాలు 968, సభ్యులు 10,026 మంది ఉన్నారు. ఇప్పటి వరకు నూతనంగా ఆరు సంఘాలను ఏర్పాటు చేయగా అందులో 65 మంది చేరారు.

అధికారుల ఆదేశాలు

నూతన సంఘాల ఏర్పాటుకు రాష్ట్రస్థాయి అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో మం డలంలోని సీసీలు అదే పనిలో ఉన్నారు. ప్రతీరోజు గ్రామాలు సందర్శించి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు చేరని వారు లేదా నూతనంగా వివాహమై గ్రామాల్లో ఉన్నవారికి ఈ అవకాశం లభించే అవకాశముంది. నూతనంగా వివాహమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. లక్ష్యసాధనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

వీరికే అర్హత

పేదలు, బీపీఎల్ కుటుంబాల వారు 15నుంచి 60ఏళ్లలోపు ఉన్న వారు కొత్త సంఘంలో చేరేందుకు అర్హులు. వ్యాపారం చేసే వారు, ఉన్నతస్థాయిలో ఉన్నవారు, ఉద్యోగులు అర్హులు కాదని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి ఆసరా లేని వారిని సంఘంలో చేర్చుకొని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో భాగమే నూతన సంఘాల ఏర్పాటు. ఈ నేపథ్యంలో మహిళలు సంఘంలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

అర్హులు చేరవచ్చు



ఇప్పటి వరకు ఏ సంఘంలో లేనివారు, కొత్తగా పెళ్లయిన వారు సంఘంలో చేరేందుకు అర్హులు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్లస్టర్ స్థాయిలో ఉన్న సీసీల దగ్గర తమపేర్లు నమోదు చేసుకోవచ్చు.

- శోభ, ఏపీయం, కులకచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్ : కాశింబౌలిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

బీఆర్ఎస్ అప్పులు చేస్తే కాంగ్రెస్ మిత్తిలు కడుతోంది

చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం, సెప్టెంబర్ 13 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసి పోతే ప్రస్తుత కాంగెస్ ప్రభుత్వం మిత్తిలు కడుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పొరుగు దేశాలకు వెళ్లి దేశంపై విషం చిమ్ముతున్నారని, రాజ్యాంగం రద్దు చేస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సంబంధించిన లెక్కలు ఆర్థికశాఖ మంత్రి వద్ద లేవన్నారు. ముందు ఇచ్చిన నిధులను ఖర్చు చేయకుండా కొత్త నిధులు అడుగుతున్నారని, ఆ లెక్కలు చెబితే కొత్త నిధులు కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. గతంలో ఉన్న పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకూ నిధులు లేవని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఇప్పటి వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదని, దీంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారని అన్నారు. బంట్వారం మండలం వెనుకబడిన మండలంగా ఉందనడానికి ఇక్కడి రోడ్లను చూస్తే అర్థమవుతుందన్నారు. రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశం, సుదర్శన్‌రెడ్డి, మల్లేశం, నాగరాజు, రాజు, సుభాష్, జనార్దన్, రాజేందర్‌రెడ్డి, బిచ్చప్ప, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్ఠను దిగజార్చిన రాహుల్‌గాంధీ

షాబాద్/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 13 : అమెరికాలో భారత దేశ ప్రతిష్ఠను దిగదార్చిన రాహుల్‌గాంధీపై దేశద్రోహం కేసు పెట్టాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరైయ్యారు. అంతకుముందు గణేష్ మండపంలో మాజీ ఎమ్మెల్యేలు రత్నం, లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమెరికాల్లో దేశ ప్రతిష్ఠను దిగదార్చిన రాహుల్‌గాంధీపై దేశద్రోహం కేసు పెట్టాలన్నారు. దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక భారత్‌పై విషం కక్కుతున్నాడని, శత్రువులు బయటి దేశాల్లో కాదు మన దేశంలోనే ఉన్నారన్నారు. కిరణ్, రాము, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్, మాణయ్య, గోవర్దన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని యువత ఈ విషయాన్ని గమనించి పార్టీలో చేరాలని విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండలం కాశీంబౌలిలో పర్యటించారు. నిజామాబాద్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, రత్నం, కంజర్ల ప్రకాష్, ఓబీసీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ఓబీసీ మండలాధ్యక్షుడు అశోక్‌యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



అనురాగ్‌లో హాక్ ఆటాక్ హాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

'అనురాగ్'లో హ్యాక్ అటాక్ హాకథాన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 13: పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో హ్యాక్ అటాక్ హాకథాన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. డిసెంబరు 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు హాకథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హాకథాన్‌లో పాల్గొనం వల్ల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి సమస్యల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఐటీవిభాగం అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రావులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిన్‌టెక్, స్మార్ట్‌సిటీ ప్లానింగ్ వంటి రంగాల్లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, సెప్టెంబరు 13 : హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణ నలుదిక్కులా ట్రిబుల్ ఆర్, ఫోర్త్‌సిటీ, విద్య వైద్య రంగాలకు సంబంధించి ఎన్నో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుడుతుంటే.. అధికారం కోల్పోవడంతో కొందరు బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయామనే అక్కసుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులపై ఉక్కుపాదం మోపడానికి కాంగ్రెస్ వెనకాడబోదన్నారు. అధికారం ఎప్పటికీ ఎవరి సొంతం కాదని, పేదళ్ల కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఎన్ని అవమానాలకు గురి చేశారో బీఆర్ఎస్ నాయకులు గుర్తుతెచ్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపనలు చేస్తూ.. బురద జల్లాలని చూస్తే రేవంత్‌రెడ్డి చూస్తూ ఊరుకోడన్నారు. అప్పటి బీఆర్ఎస్ పాలన మాదిరిగా నిర్బంధాలు చేస్తే ప్రతిపక్ష నాయకులెవరూ రోడ్లపై తిరగలేరన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే సహించబోమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ సూచనలు పాటించి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాపాలనలో ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని, ఇది చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

కుర్మిద్దకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

- మేడిపల్లి నుంచి తరలించనున్న అధికారులు
- నెట్‌జీరో సిటీ పేరుతో ఏర్పాటుకు శ్రీకారం



మేడిపల్లిలో కొనసాగుతున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం, సెప్టెంబరు 12 : మండల పరిధిలోని మేడిపల్లిలో గల హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పేరుతో ఉన్న పోలీస్ స్టేషన్‌కు నెట్ జీరో సిటీ పేరిట కుర్మిద్దలో ఏర్పాటుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. కాగా, మేడిపల్లిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు బాధితులు రాలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అద్దెభవనంలో ఠాణా శీర్షికన వచ్చిన కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. చుట్టుపక్కల గ్రామాలకు ఠాణా చాలా దూరం ఉందని ఇంటలిజెన్స్ నివేదికను రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు తెప్పించుకొని జనం గోడు తెలుసుకున్నట్లు సమాచారం. దాంతో మేడిపల్లిలో ఉన్న స్టేషన్‌ను కుర్మిద్దకు మార్చడానికి అధికారులు ముమ్మరంగా యత్నిస్తున్నారు. కుర్మిద్దకు పోలీస్ స్టేషన్ మారిస్తే అన్ని గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉంటుందని ఆ శాఖకు చెందిన ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ చేసి రాచకొండ సీపీకి సమాచారమిచ్చారు. ఈమేరకు కుర్మిద్దలో స్టేషన్‌కు అనువుగా ఉన్న భవనాన్ని పోలీస్ అధికారులు పరిశీలించారు. కందుకూరు మండలంలోని బేగరికంచలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుండడంతో ఇటు యాచారం, అటు కందుకూరు మండలాల వాసులకు అనువుగా ఉన్నచోట పోలీస్ కుర్మిద్దలో పదెకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాంట్లో కొత్త భవనం కట్టించడానికి గానీ, ఫార్మాసిటీ కొరకు సేకరించిన భూమిలో భవనంతో పాటు క్వార్టర్లు కట్టడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో భూదాన్ భూములు అన్యాక్రాంతం

- నందిగామ భూములపై విచారణ చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



బక్కని నర్సింహులుకు వినతిపత్రం ఇస్తున్న నందిగామ గ్రామస్థులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 13: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో భూదాన్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామకు చెందిన భూదాన్ భూముల బాధితులు శుక్రవారం బక్కనిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో బక్కని మాట్లాడారు. వినోభాబావే చేపట్టిన భూదానోద్యమానికి స్పందించి నందిగామ గ్రామానికి చెందిన భూస్వామి లంకాల నారాయణరెడ్డి 99.20 ఎకరాల భూమిని 1956 ఫిబ్రవరి 10న ఇచ్చారని తెలిపారు. ఆ భూమిపై 1975 నవంబర్ 24న భూదాన్ బోర్డు అధికారులు, గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామ సభ నిర్వహించారని తెలిపారు. 99.20 ఎకరాల భూమిలో 68.22 ఎకరాలను భూమిలేని 18 మందికి పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన భూమి భూదాన్ బోర్డు తన ఆధీనంలో పెట్టుకుందని తెలిపారు. అయితే ఆ భూమిని రైతులు కాస్తూ చేస్తూ అనుభవించాలే తప్ప, ఇతరులకు విక్రయించే హక్కులేదని గుర్తుచేశారు. కొంత భూమిని అనుభవిస్తున్న రైతులు విక్రయించుకోగా, మిగిలిన భూమిని మేకగూడ గ్రామానికి చెందిన రైతులు అక్రమించుకుని విక్రయిస్తున్నారని ఆరోపించారు. చట్ట విరుద్ధంగా భూదాన్ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా విక్రయిస్తుంటే రెవెన్యూ అధికారులు ఎలా పట్టామార్పిడి చేస్తున్నారని ప్రశ్నించారు. భూదాన్ బోర్డు ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ల ప్రకారం తమకు భూములు ఇప్పించాలని కలెక్టర్లకు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, కోర్టులను ఆశ్రయించినా నేటి వరకు బాధితులకు న్యాయం జరగడం లేదని గుర్తుచేశారు. సమగ్ర సర్వేచేసి, అక్రమ రిజిస్ట్రేన్లను రద్దు చేసి, ఆక్రమదారులను తొలగించి, బాధితులకు ఇప్పించాలని బక్కని డిమాండ్ చేశారు.

టాస్క్ సీవోవోగా సుంకిరెడ్డి బాధ్యతల స్వీకరణ



టాస్క్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 13 : టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) సీవోవోగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో పూజలు చేసి వేదపండితుల ఆ శీర్వాదం అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో కొనసాగే టాస్క్‌కు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, సుంకిరెడ్డికి మే 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఆయన అమెరికాలో ఉండటంతో బాధ్యతలు చేపట్టలేదు. వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి వృత్తి నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల స్థాయిలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న అనురాధ పత్యానాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 13: హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకురాలు అనురాధపత్యానాయక్ అన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తుందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 9 నెలలు గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. రైతు బంధు నిలిపివేసి రైతులను వేదనకు గురిచేస్తుందని, నేటికీ 40 శాతం కూడా రుణమాఫీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆరు గ్యారెంటీలు హామీలకే పరిమితమయ్యాయని, ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విలేఖరుల బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు ఎంగలి రఘు, సురేందర్ రెడ్డి, చుక్క నిరంజన్ గౌడ్, సరిత పంతూనాయక్, గుత్తి బాలస్వామి, రమేశ్‌నాయక్, దేరంగుల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చేవెళ్ల : ముడిమ్యాల్‌లో కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 13 : కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంటల సాగులో నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, మొక్కజొన్న పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లయ్య, ఏరువాక కేంద్రం తాండూర్ కోఆర్డినేటర్ టీ.లక్ష్మణ్, శాస్త్రవేత్త యమునలు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల్, రావులపల్లి, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, కందితోపాటు కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు, కందిలో ఆకు చుట్టు పురుగు, పత్తిలో వడలు తెగులు, వరిలో పొటాష్ జింకులోపం తదితర వాటిని గుర్తించడం జరిగిందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు యాజమన్య పద్దతులు పాటించాలని రైతులకు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పోలాల్లో వర్షం నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఏవోలు శంకర్‌లాల్, అనురాధ, ఏఈవోలు సునీల్, బాలకోటేశ్వరారావు, రైతులు ఉన్నారు. అలాగే మొయినాబాద్ మండలంలోని ఎన్కేపల్లి, అజీజ్‌నగర్ తదితర గ్రామాల్లో శాస్త్రవేత్తలు పర్యటించారు. మొక్కజొన్న, వరి, కంది, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణాధికారులు సునీల్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

● భారత రాష్ట్ర సమితి నాయకులు

మంచాల, సెప్టెంబరు 13: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ తలపెట్టిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటిముట్టడి నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నేతలు చీరాల రమేష్, బహదూర్, బుస్సుపల్లారెడ్డి, జానీపాష, జంబులకిషన్‌రెడ్డి, చిందం జంగయ్య, బద్రీనాథ్‌గుప్త, జగన్‌రెడ్డి, తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇబ్రహీంపట్నం : కౌశిక్‌రెడ్డి, ఆరెకపూడి గాంధీల మధ్య తలెత్తిన వివాదం, నాయకుల అరెస్టుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్‌రావు, జెర్కోని రాజు, నిట్టు జగదీశ్వర్‌తోపాటు తదితరులను అరెస్టు చేశారు.

శంషాబాద్ రూరల్ : మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్‌ను ఆయన నివాసం నర్కూడలో పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు.

షాబాద్ : ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో షాబాద్ బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యాచారం : హరీష్‌రావు, కౌషిక్‌రెడ్డిల అక్రమ అరెస్టుకు మండల కేంద్రంలో ధర్నా చేయడానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రణాళిక రూపొందించారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడానికి సిద్దమయ్యారు. యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌లు ఖాజుద్దీన్, యాదయ్య, ఎం, శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, సాయిరెడ్డి, సాయిచారి, కృష్ణ, గిరిలను అదుపులోకి తీసుకొని సాయంత్రం విడుదల చేశారు.

కందుకూరు : అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత కాకి దశరథలు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. తాండ్ర దేవేందర్, పి.శ్రీహరి, పొట్టి ఆనంద్, తాళ్ల కార్తీక్, సురేష్, బొక్క దీక్షిత్‌రెడ్డి, జంగయ్య, సుదర్శన్ రెడ్డి,ఎస్ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య జరిగిన ఘర్షణను రాష్ట్రవ్యాప్త సమస్యగా చూపించి, బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు గూడ వీరేశ్, జగదీశ్వర్, యెన్నం శ్రీధర్ రెడ్డి, లంకాల సురేష్ రెడ్డి మాట్లాడారు. కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ పరస్పర ఆరోపణలు, సవాళ్లు చేసుకుని, ఒకరి ఇంటిపై మరొకరు దాడికి తెగబడ్డారని, వారిలో వారు ఘర్షణపడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారని తెలిపారు. కాగా, నాయకులు స్థాయి నిబట్టి మాట్లాడితే మంచిదని హితబోధ పలికారు. తండ్ర శ్రవణ్ రెడ్డి, గిరిధర్ యాదవ్, భాస్కర్ గౌడ్, అనుమగళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : శుక్రవారం తెల్లవారుజామున కేశంపేట పోలీసులు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఆయన స్వగృహం ఎక్లాస్‌ఖాన్‌పేటలో హౌజ్ అరెస్ట్ చేశారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, కె. నవీన్ కుమార్, తోట అంజనేయులు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, మాజీ ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, సాజీద్, శ్రీనివాసులను ఆయా గ్రామాలలో అదుపులోకి తీసుకుని మాజీ ఎమ్మెల్యే ఇంటికి తరలించారు. సాయంత్రం వరకు పోలీసులు వారిని హౌజ్ అరెస్ట్‌లో ఉంచారు.



ఇబ్రహీంపట్నం : అరెస్టయిన బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్ : షాద్‌నగర్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మున్సిపల్ చైర్మన్ కె నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమపట్ల కక్షపూరితధోరణి అవలంబిస్తుందని విమర్శించారు.

ఆమనగల్లు/కడ్తాల/తలకొండపల్లి : ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమనగల్లులో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్, రైతు సంఘం అధ్యక్షుడు రూపం వెంకట్ రెడ్డి, తలకొండపల్లిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు అరెస్ట్ ను నిరసిస్తూ కడ్తాలలో మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ఇంటి నుంచి రోడ్డు మీదికి ఆందోళనకు వెళ్తున్న దశరథ్ నాయక్, ఆనంద్, వీరయ్య, పరమేశ్, నర్సింహలతో కలిపి 24 మందిని అరెస్ట్ చేశారు. కాగా, హరీశ్‌రావు అరెస్ట్‌ను నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు ముందస్తు అరెస్ట్ చేస్తుండడంతో స్టేషన్ ఎదుట దర్నా నిర్వహించారు.

చేవెళ్ల : అక్రమ అరెస్టులు చేయడం దారుణమని చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, చేవెళ్ల బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. వెళ్లకుండా బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్‌లు అరెస్టు చేశారు. మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీటీసీలు ఎల్లయ్య, సత్యనారాయణచారి, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ ఘనీ, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదర్శన్‌గౌడ్



నూతన కార్యవర్గంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు

కొత్తూర్, సెప్టెంబరు 13: కాంగ్రెస్ పార్టీ కొత్తూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జె.సుదర్శన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనాడు. కొత్తూర్ నూతనంగా మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత కూడ మండల కాంగ్రెస్ కమిటీలో కొనసాగుతూ వచ్చింది. ఎమ్మెల్యే శంకర్ ఆదేశాలతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశ్రామికవాడలోని సాయిరాం ఫంక్షన్‌హాల్ కమిటీ ఎన్నుకున్నారు. సమన్వయ కమిటీ సభ్యులు జె.గోవర్ధన్‌గౌడ్, అంబటి ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, రవికుమార్‌గుప్త, దేవేందర్‌ముదిరాజులు మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందూరి శ్రీనివాస్, జెనిగె జగన్, కమ్మరి జనార్ధన్‌చారి, కర్రొళ్ల సురేందర్, విజయ్‌పాల్‌రెడ్డి, గాలిగాని మాణయ్య, గోవింద్‌నాయక్, నవీన్‌చారి, వీర్లగూడెం మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన నూతన కార్యవర్గం..



సుదర్శన్ గౌడ్

ఉపాధ్యక్షులుగా పసుపుల మహేందర్, బండారు భరత్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా చిలకమర్రి నర్సింహ, వీర్లగూడెం నర్సింహ, వర్కింగ్ ప్రసిడెంట్‌లుగా అక్కవానిగూడ రాజు, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కోటేశ్వర్, అంజినాయక్, కార్యదర్శిగా జెనిగె శివ, జాయింట్ సెక్రటరీగా కుమ్మరి లక్ష్మయ్య, ట్రెజరర్‌గా చింత సాయి తేజేశ్వర్, మిడియా కన్వీనర్‌గా చిలకమర్రి రాణాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

తలకొండపల్లి, సెప్టెంబరు 13: సీతారాం ఏచూరి మృతి పీడిత, తాడిత, అణగారిన వర్గాలకు తీరని లోటని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పళ్ల శివశంకర్‌లు అన్నారు. వెంకట్రావ్‌పేటలో ఏచూరి సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీనివాసులు, కుమార్, దస్తగిరి, చంద్రయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన ఏచూరి మరణం సీపీఎంకే కాకుండా దేశ ప్రజానీకానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అలువాల రవికుమార్ అన్నారు. మహేశ్వరంలో ఏచూరి చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యమంలో కవిత, చంద్రయ్య, శేఖర్, రాములు, జంగయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీతారాం ఏచూరి చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు బి.బాల్‌రాజ్, ఎ.కుమార్, ఆర్.చందు, ఎన్.నర్సింహ, సాతిరి కృష్ణ, బర్కం ప్రభాకర్, చిందం అంజయ్య, బాలరాజ్, మమిద్దె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాంచందర్, తదితరులు

మొయినాబాద్ రూరల్ : ఏచూరి పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, జిల్లా నాయకుడు ప్రవీన్ కుమార్‌లు అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రం, అజీజ్‌నగర్ చౌరస్తాల వద్ద వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఏచూరి చిత్రపటాల వద్ద వారు నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు రత్నం, గోపాల్, శేఖర్, ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి, చాంద్ పాషా, కార్మికులు పాల్గొన్నారు.

యాచారం : సీతారాం మరణం పార్టీకి తీరని లోటని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహలు అన్నారు. మండల కేంద్రంలో మాల్‌లో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు కె.జగన్, అంజయ్య, బ్రహ్మయ్య, ఎం.శ్రీమన్నారాయణ, ఎంజె వినోద్‌కుమార్, మాజీ సర్పంచులు దంతుక పెద్దయ్య, బోడ కృష్ణ తదితరులున్నారు.

పార్వతీ తనయుడికి ఘనంగా పూజలు

ఆమనగల్లు /కడ్తాల్, సెప్టెంబరు 13:ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ నవరాత్రోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవ కమిటీలు మండపాల వద్ద పోటాపోటీగా అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు మల్లేశ్, రవి, సాయిప్రభు, సత్యం, బిక్షపతి, రమేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, శంకర్, తదితరులు ఉన్నారు. కాగా, ఆమనగల్లు పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కాలనీ మహిళలు యువతీ యువకులు ఆటపాటలతో అలరించారు. ఎస్సై వెంకటేష్, నాయకులు తదితరులున్నారు.

చేవెళ్ల : ఎమ్మెల్యే యాదయ్య మండల కేంద్రంలోని న్యూజర్నలిస్టు కాలనీ, రంగారెడ్డి కాలనీ, మండల పరిధిలోని దేవునిఎర్రవల్లిలో జరిగిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాదం పంపణీ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదలు స్వీకరించారు. నాయకులు, భక్తులు తదితరులు ఉన్నారు. కాగా, వినాయక నిమజ్జనం సందర్భంగా చేవెళ్లలో బాంబు స్క్వాడ్ టీం మండల కేంద్రంలోని వినాయక మండపాల వద్ద సైబరాబాద్ పోలీస్ బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. వినాయకుడి విగ్రహాలను ఎప్పుడు నిమజ్జనం చేస్తున్నారని ఉత్సవ కమిటీ సభ్యులను పోలీస్‌లు అడిగి తెలుసుకున్నారు. కాగా, గుండాలలో కుర్మసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి పెద్ద లడ్డూ రూ.72,000 వేలకు దండు మహేందర్ దక్కించుకున్నారు. చిన్న లడ్డూను రూ.46,000లకు జెట్ట కుమార్ దక్కించుకున్నారు.



చేవెళ్ల : పూజలో ఎమ్మెల్యే యాదయ్య

కడ్తాల్ : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ గణేశ్ మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి, సీఐ శివప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, స్థానిక నేతలతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులున్నారు.

మహేశ్వరం : పదేళ్లగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్‌రింగ్‌రోడ్డు వద్ద గణనాథుడిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు ఔటర్ టోల్ ప్లాజా సిబ్బంది. తుక్కుగూడ మున్సిపల్ పరిధి ఎగ్జిట్ 14 టోల్ ప్లాజా నెలకొల్పిన విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల్లో కృష్ణమూర్తి, సునీల్‌సింగ్, అఖిల్‌సింగ్, విశ్వజిత్‌సింగ్, జాదవ్, హేమంత్, రాజేందర్, నగేష్, కేధార్నాధ్, భాస్కర్‌గౌడ్, ఆదినాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే యాదయ్య, హోప్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. షాబాద్‌లోని గణేష్ చౌరస్తాలో నెలకొల్పిన వినాయకుడికి హోప్ ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు మల్లిఖార్జున్ పూజలు చేసి, అన్నప్రసాదం నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



కడ్తాల : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

సంక్షిప్తంగా..

యాచారం : మల్కీజ్‌గూడ గ్రామ డ్వాక్రా సంఘాల బుక్ కీపర్ రాణి ఎలాంటి తప్పులు చేయలేదని, ఆమెపై తప్పుడు ఫిర్యాదులు చేశారని గ్రామానికి చెందిన పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీవో పీడీ శ్రీలతకు ఫిర్యాదు చేశారు. ఆమెపై తప్పుడు ఫిర్యాదు చేశారని వారు పీడీ శ్రీలతకు సమర్పించిన పత్రంలో చెప్పారు. విచారణ చేయడానికి అధికారులు నిర్ణయించారు.

కేశంపేట : పోమాల్‌పల్లికి చెందిన పబ్బె పెంటయ్య శుక్రవారం మృతి చెందాడు. కాంగ్రెస్ నాయకులు నిదురం కృష్ణయ్య, అనుమగళ్ల రమేష్‌లు కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డికి విషయం తెలిపారు. ఆమె రూ.5వేలు మృతుడి కుటుంబానికి అందించారు.

షాబాద్ : పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాళ్లపల్లి పాఠశాలలో 2010 -11 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు 10 సీలింగ్ ఫ్యాన్లు, ఒక నేమ్ బోర్డును అందజేశారు.

చేవెళ్ల : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని పీడీఎస్‌యూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ తెలిపారు. డిగ్రీ కళాశాలను నాయకులు సందర్శించారు. శ్రీకాంత్, ప్రభాస్, చక్రి, తదితరులు ఉన్నారు.

కొందుర్గు : టేకులపల్లిలో ధర్మసమాజ్‌పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ తెలిపారు. కన్వీనర్‌గా బుడ్డోని శ్రీనివాసులు, కో కన్వీనర్లుగా తొండపల్లి శ్రీకాంత్, ఎర్రోళ్ల రాజు, ప్రధాన కార్యదర్శులుగా బి.భానుప్రసాద్, డి.గణేష్, కార్యదర్శులుగా తొండపల్లి కుమార్, బుడ్డోని కిరణ్, డి.కళ్యాణ్, కోశాధికారిగా బుడ్డోని రమేష్, 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

చౌదరిగూడ : క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై బహుమతులందజేశారు.

కొందుర్గు : విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 200మంది పాల్గొనగా, 14, 17 సంవత్సరాల విభాగాల్లో ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

ఆమనగల్లు : విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సేవా కార్యక్రమాలపై రూపొందించిన పాట సీడీని ఆవిష్కరించారు.

షాద్‌నగర్‌రూరల్ : గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. ఫరూఖ్‌గర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు లాంగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యులత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాబాద్ : చెత్త డంపింగ్ తొలగించాలని కేశవగూడ గ్రామస్థులు తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. షాబాద్ నుండి తీసుకువచ్చి కేశవగూడ గ్రామ సమీపంలో రోడ్డుపై పోయడంతో దుర్వాసన, ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మాజీ సర్పంచ్ కవితనర్సింహులు, గ్రామస్తులు వెంకటయ్య, చంద్రశేఖర్, జంగయ్య, తదితరులున్నారు.

షాబాద్ : సమాజంలో అజ్ఞానం అనే చీకటిని తొలిగించి వెలుగులు నింపేది ఉపాధ్యాయులే అని ఎంఈవో శంకర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానసభను నిర్వహించారు. అనంతరం జిల్లా, మండలాలకు చెందిన 27 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

కడ్తాల్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను మండల కేంద్రానికి చెందిన యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ కలిశారు. హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

ఇబ్రహీంపట్నం : శక్తివంతమైన భారత్ కోసం బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సి ఉందని రాష్ట్ర నాయకులు ముత్యాల భాస్కర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డిలు అన్నారు. ఇబ్రహీంపట్నంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి, విజయ్‌కుమార్, టేకుల రాంరెడ్డి, సత్యకుమార్ శ్రీశైలం, తదితరులున్నారు.

కొందుర్గు/యాచారం/చేవెళ్ల/కందుకూరు : స్థానిక ఎన్నికల నేపథ్యంలో వార్డుల వారీగా గ్రామ పంచాయితీల ఓటర్ల జాబితాను శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ప్రదర్శించినట్లు కొందుర్గు ఎంపీవో లాలయ్య తెలిపారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీవో శ్రీలత తెలిపారు. చేవెళ్ల మండలంలోని జీపీల్లో ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీవో హిమబిందు తెలిపారు. వార్డులవారీగా జాబితా ప్రదర్శించినట్లు కందుకూరు డీఎల్‌పీవో లక్ష్మీనారాయణ, ఎండీవో సరితలు తెలిపారు. ఎంపీవో గీత, కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

శంషాబాద్ : తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ దోహదపడాలని టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు జె.నరేందర్ కోరారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వైఎన్‌ఆర్ గార్డెన్‌లో శక్రవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గం మొత్తం రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలిస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో విసిగివేసారిపోయిన ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు.

చేవెళ్ల : వాహనదారులు రోడ్డుపై డ్రైవ్‌చేసే సమయంలో మూలమలుపుల వద్ద చూసి డ్రైవ్ చేయాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. మండల క్రేందంలోని హైదరాబాద్-బీజాపూర్, శంకర్‌పల్లి-షాద్‌నగర్ ప్రధాన రోడ్లపై ఉన్న మూలమలుపులను పరిశీలించి బోల్‌గార్డ్స్ ఏర్పాటు చేయించారు.

కేశంపేట : సమాజంలో గురువులది పవిత్రస్థానమని, నేటి గురువులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కేశంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 38 మంది, ప్రైవేటు పాఠశాలలో 16 ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయులు, అలాగే నాలుగురు సీఆర్‌పీలను శుక్రవారం మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో మండల విద్యాశాఖ ఆధర్యంలో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జీ ఎంఈవో మనోహర్, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, మండల నోడల్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపు తప్పి చెరువులో పడిన ట్రాక్టర్

● డ్రైవర్ క్షేమం.. త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆమనగల్లు, సెప్టెంబరు 13: ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో ట్రాక్టర్ పడిన ఘటనలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండా సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రామ్‌నగర్ తండాకు చెందిన జాటావత్ కుమార్ ట్రాక్టర్ నడుపుకుంటూ చంద్రాయన్‌పల్లి తండా సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నాడు. తండా సమీపంలోని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులోకి పడింది. డ్రైవర్ కుమార్ నీటిలో దూకడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

బ్యాటరీల చోరీ కేసును ఛేదించిన పోలీసులు

తలకొండపల్లి, సెప్టెంబరు 13: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో బ్యాటరీల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా స్థానిక, సీసీఎస్ పోలీసులు నిందితులను గుర్తించారు. శుక్రవారం తలకొండపల్లి స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్సై శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆర్సాలన్ అహ్మద్, సయ్యద్ ఇర్ఫాన్ హుస్సేన్, మహ్మద్ ఇబ్రహీంలు ముఠాగా ఏర్పడి వాహనాల బ్యాటరీలు దొంగిలించేందుకు పథకం వేశారు. ఆగస్టులో చుక్కాపూర్‌కు ఎర్టిగా కారులో వచ్చి పది బ్యాటరీలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చుక్కాపూర్ నుంచి హైదరాబాద్ చాంద్రాయణగుట్ట వరకు స్థానిక, సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాటరీ చోరీలకు పాల్పడిన వారిని గుర్తించారు. ఆ ముగ్గురు నిందితుల్లో ఇర్ఫాన్ హుస్సేన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు జాషువా, రఘులను ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్ అభినందించారు.

ఆస్తి కోసం అన్నను కడతేర్చిన తమ్ముడు

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 13: మానవ సంబంధాలు మంటకలిసేలా ఆస్తి కోసం అన్నను చంపిన సంఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దూసకల్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. దూసకల్ గ్రామానికి చెందిన కేశమోని కృష్ణయ్య(52) భార్య కళమ్మ దంపతులకు సంతానం లేరు. రెండేళ్ల క్రితం కళమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కృష్ణయ్య ఒంటరిగా ఉంటున్నాడు. అతడి పేరు మీద ఉన్న ఆస్తిని ఎలాగైన కొట్టేయాలని అతడి తమ్ముడు చంద్రయ్య పథకం వేశాడు. ఈ నెల 7న చంద్రయ్య మద్యం బాటిల్ కొనుగోలు చేసి అన్న ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఈక్రమంలో అన్నకు ఎక్కువగా తాగించి తన బైక్‌పై ఎక్కించుకొని గ్రామ చివరన ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లి అందులో తోశాడు. అనంతరం అతడి ఇంట్లో అతడితో పాటు అతడి భార్య పేరు మీద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు, 3 తులాల బంగారు వస్తువులు, బ్యాంక్ ఖాతా పుస్తకాలు, రూ.31,500 నగదు తీసుకెళ్లాడు. అనంతరం తన అన్న కనిపించడం లేదని మహేశ్వరం మండలం కల్వకోలులో ఉన్న మృతుడు కృష్ణయ్య అత్త బాలమ్మకు ఫోన్‌చేసి చెప్పాడు. ఆమె 9న దూసకల్‌కు వచ్చి బంధువుల నుంచి అల్లుడి ఆచూకీ తెలుసుకున్నా ప్రయోజనం లేకపోవడంతో అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చంద్రయ్యపై అనుమానం ఉందని పేర్కొంది. పోలీసులు చంద్రయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

బీఆర్‌ఎస్ నేతలపై పోలీసుల ఫిర్యాదు

● కేశంపేట ఠాణాలో నమోదు!

కేశంపేట, సెప్టెంబరు 13: సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అరెస్ట్ విషయంలో తమ విధులకు ఆటంకం కలిగించారంటూ కేశంపేట పోలీసులకు సైబరాబాద్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదైనట్లు సమాచారం. కేసులు నమోదైన వారిలో ఒక మాజీ ఎమ్మెల్యే ఉండడం గమనార్హం. గురువారం రాత్రి గచ్చిబౌలి నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డితో పాటు గంగుల కమలాకర్‌ను గురువారం ముందస్తుగా అరెస్ట్‌చేసి పోలీస్ వాహనంలో కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకవస్తుండగా మార్గమధ్యలో కొత్తపేట సమీపంలో బీఆర్‌ఎస్ నాయకులు మూకుమ్మడిగా దాడికి పాల్పడి బస్సు అద్దాలు పగులకొట్టారు. షాద్‌నగర్ ఏసీపీ వారించినా వినకుండా పోలీస్ విధులకు ఆటంకం కలిగించారు. అలాగే ఎక్లాస్‌ఖాన్‌పేటలో పోలీస్ వాహనం అడ్డగించిన వారిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా కేశంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో 196/2024, 197/2024, 198/2024 మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, కేసులు నమోదు చేసిన విషయాన్ని పోలీసులు అధికారికంగా నిర్థారించలేదు. ఈ కేసును షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షిస్తున్నాట్లు పోలీస్ శాఖవారు తెలిపారు.

నిరీక్షణ.. ప్రదక్షిణ!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,99,064 వివిధ రకాల పింఛనుదారులు ఉన్నారు. ప్రతి నెలా పోస్టాఫీసు ద్వారా వీరికి రూ.49.44 కోట్లు పింఛను సొమ్ము పంపిణీ అవుతోంది. వృద్ధాప్య, వితంతు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, డయాలసిస్ పేషెంట్లు, ఫైలేరియా, ఏఆర్టీ పెన్షనర్లకు, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 పంపిణీ చేస్తున్నారు.

పెంచని పెన్షన్ సొమ్ము

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా పేద ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. కేవలం ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రస్తావించడం మినహా మిగతా హామీలను మరిచారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వెంటనే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ. 2016 పింఛన్ డబ్బును రూ.4 వేలకు, దివ్యాంగులకు ఇచ్చే రూ.4,016 పింఛన్ డబ్బులను రూ.6 వేలకు పెంచుతామని హామీనిచ్చారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి ఓటేసి గెలిపించిన ఆసరా పింఛన్‌దారులు పింఛన్ల పెంపు ఎప్పుడో అంటూ ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. పింఛన్ డబ్బులు పెంచుతామని హామీనిచ్చినప్పటికీ ఇంకా పాత పింఛన్లే ఇస్తుండడం గమనార్హం. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు 2022 నుంచి ఎదురుచూస్తున్నారు. పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులు వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోకపోవడంతో వారి పింఛన్లు కట్ అయ్యాయి. వీరంతా తిరిగి దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది.

పూట గడవడం కష్టంగా ఉంది



వృద్ధాప్యంలో కూలీ పనులకు వెళ్లలేకపోతున్నా. నా భర్త ఉన్న సమయంలో ఆయనకు పింఛను వచ్చేది. పింఛను డబ్బులతో కాలం వెళ్లదీశాం. ఆయన ఐదేళ్ల క్రితం చనిపోయాడు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. పింఛను వచ్చింది. కానీ. వచ్చిన విషయం నాకు తెల్వదు. మూడు నెలలు తీసుకోకపోవడంతో పింఛను తొలగించారు. ప్రభుత్వం పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

- సోలంకి రేఖ, వితంతువు, ఆలూరు, చేవెళ్ల మండలం

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం : వీర్లపల్లి

షాద్‌నగర్, సెప్టెంబరు 14: కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం లభిస్తుందని, బడుగు వర్గాలకు చెందిన వ్యక్తిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించడంతో ఈ విషయం మరింత స్పష్టమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి అండగా నిలిచి పార్టీ అభివృద్ధికి మహేష్‌కుమార్‌గౌడ్ ఎంతకృషి చేశారని కొనియాడారు. పీసీసీ అధ్యక్షుడి ప్రమాణాస్వీకారానికి షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి 100 బస్సుల్లో 2వేల మంది కార్యకర్తలతో తరలివెళ్లనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కాగా, బీఆర్‌ఎస్ బలుపు రాజకీయాలు చేస్తుందని ఎమ్మెల్యే విమర్శించారు. పార్టీ ఫిరాయింపులకు పునాది రాయి వేసిందే బీఆర్‌ఎస్ అన్న విషయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు, నేతలు గుర్తుంచుకోవాలన్నారు. సీపీఎం కల్మషం లేని కమ్యూనిస్ట్ నేతను కోల్పోయిందని, సీతారం ఏచూరి మరణం ఆ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఏచూరికి నివాళులు అర్పించారు.